క్లుప్తంగా

వృద్ధులకు పండ్ల పంపిణీ



ఆరిలోవ నైట్ షెల్టర్‌లో వృద్ధులకు పండ్లు అందిస్తున్న యువకులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం ముస్తఫా కాలనీలో జీవీఎంసీ ఆధ్వర్యంలో అమ్మా నాన్న వెల్ఫేర్ సొసైటీ నిర్వహిస్తున్న నైట్ షెల్టర్‌లో వృద్ధులకు మంగళవారం పలువురు యువకులు పండ్లు పంపిణీ చేశారు. ఆరిలోవ కాలనీకి చెందిన నవయువ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, యువ చైతన్య చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పీలా మనోజ్ పుట్టిన రోజు సందర్భంగా అరటి, జామ పండ్లు అందజేశారు.

సెల్ టవర్ ఏర్పాటుపై ఆందోళన



రామలక్ష్మణపురంలో ఏర్పాటు చేస్తున్న టవర్

ఆరిలోవ: చినగదిలి ప్రాంతం రామలక్ష్మణపురంలో ఓ ఇంటిపై ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ మాకొద్దు అంటూ స్థానికులు ఆందోళనకు దిగారు. ఇక్కడ కొన్నాళ్ల క్రితం నిర్మించిన ఓ ఇంటిపై ఎయిర్‌టెల్ సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఆ ఇల్లు పటిష్టంగా లేదని, ఏ సమయంలో కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానిక మహిళలు మంగళవారం నిరసన తెలిపారు. సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్న ఇంటి ముందు కొద్దిసేపు ఆందోళన చేశారు. టవర్ నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని నినాదాలు చేశారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించాలని కోరారు.

అప్పన్న నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న నరసింగరావు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఎ.మురళీకృష్ణ అనే దాత రూ.1,00,116 విరాళం అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నదాన విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేశారు. అధికారులు దాతకు స్వామివారి దర్శనాన్ని కల్పించి ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన విభాగం సిబ్బంది హరి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఆరిలోవ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం ఆరిలోవలోని 11వ వార్డులో టీడీపీ నాయకులు చేపట్టారు. పట్టభద్రుల ఇంటికి వెళ్లి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ముగడ రాజారావు, అప్పలనాయుడు, కృష్ణంరావు, కాలేషా, తదితరులు పాల్గొన్నారు.

డిజిటలైజేషన్‌తో విస్తృత సేవలు

బీచ్ రోడ్డు: వాహనాలను డిజిటలైజేషన్ చేయడం వల్ల విస్తృత సేవలు అందించవచ్చునని బ్లాక్ బుక్ సీఈవో రాజేష్ తెలిపారు. మంగళవారం ఆయన నగరంలోని ఒక హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో లక్షకుపైగా ట్రక్కర్లను డిజిటలైజ్ చేసినట్టు చెప్పారు. తద్వారా ఐదు వేల గ్రామాలకు సేవలు విస్తరించినట్టు తెలిపారు. ఈ ఏడాది ముగింపు నాటికి 15 వేల గ్రామాలకు ట్రక్కర్ల సేవలు విస్తరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

జీ-20 సదస్సుకు నగరం ముస్తాబు



ఏనుగు బొమ్మకు పెయింటింగ్ వేస్తున్న కళాకారులు



బీచ్ రోడ్డులో మొక్కలు నాటుతున్న జీవీఎంసీ సిబ్బంది



ఫుట్‌పాత్ గోడకు పెయింటింగ్ వేస్తున్న కళాకారులు

బీచ్ రోడ్డు: జీ-20 సదస్సుకు నగరం ముస్తాబవుతోంది. సాగర తీరంలో సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. తీరం వెంబడి ఉన్న పలు ఆకృతులకు పెయింటింగ్ వేయడంతో నూతన శోభను సంతరించుకున్నాయి. సాగర కన్యలు, పులులు, ఏనుగులు, డైనోసర్ల బొమ్మలకు రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. రోడ్డు మధ్యలోని డివైడర్లపై పూల మొక్కలు నాటి, పచ్చదనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: బాల్య వివాహాలను నిరోధించాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. చైల్డ్ లైన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కల్పిస్తూ తీర్చిదిద్దిన పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బాలికలకు వివాహం చేయడం, వివాహం చేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్, చైల్డ్‌లైన్ నోడల్ అధికారి జి.సూరిబాబు, జిల్లా కోఆర్డినేటర్ జి.డేవిడ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు కృషి చేయాలి



ఎంపీ విజయసాయిరెడ్డితో ప్రసాద్

బీచ్ రోడ్డు: పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టేలా మరింత కృషి చేయాలని ఎంపీ విజయసాయిరెడ్డిని ఓబీసీ జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ కోరారు. ఈ మేరకు నగరానికి వచ్చిన ఎంపీని మంగళవారం కలసి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే చాలా సార్లు బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించడం హర్షనీయమన్నారు. ఇటీవల రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రకటించిన 18 ఎమ్మెల్సీలకు 11 మంది బీసీ వర్గానికి చెందిన వారే ఉండడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కుంభా రవిబాబుకు అభినందనలు



రవిబాబును అభినందిస్తున్న పితాని, తదితరులు



రవిబాబును సత్కరిస్తున్న గొండు సీతారాం

ఏయూ క్యాంపస్: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన ఏయూ విశ్రాంత ఆచార్యుడు కుంభా రవిబాబును బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసారు. మంగళవారం విశాఖలో రవిబాబు దంపతులను వారి నివాసంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గవర్నర్ కోటాలో విశ్వవిద్యాలయానికి చెందిన వ్యక్తికి తొలిసారిగా ఎమ్మెల్సీగా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటనాయుడు, ఎం.నరేష్‌కుమార్, కె.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కుంభా రవిబాబుకు సత్కారం

మద్దిలపాలెం : ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన కుంభా రవిబాబుకు చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సౌత్‌జోన్ రాష్ట్రాల కన్వీనర్ గొండు సీతారాం అభినందనలు తెలిపారు. పిఠాపురం కాలనీలోని రవిబాబు క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి సత్కరించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు.

23న సహస్ర తులసి పూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈనెల 23న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నా మని ఆలయ కార్య నిర్వహణాధికారి శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనే దంపతులు రూ.1500 చెల్లించాలని ఆమె పేర్కొన్నారు.

పుస్తక పఠనం జీవితంలో భాగం కావాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ

మద్దిలపాలెం : నిరంతర అధ్యయనం, పుస్తక పఠనం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. రెడ్ బుక్ డే సందర్భంగా పిఠాపురం కాలనీలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులు, వామపక్ష వాదులు, కవులు, రచయితలు, అభ్యుదవాదులు, సాహితీ ప్రియులు రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. మనం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మార్గాన్ని చూపించేవిగా మన సాహిత్యం ఎంతో దోహదపడుతుందన్నారు. పార్టీ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిహెచ్.ఎల్.ఎన్.శాస్త్రి, జీవీఎన్ చలపతి, జి.ఎస్.రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

261 మందికి కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో రోటరీ ఫౌండేషన్ గ్లోబల్ ఫండ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: మహిళల స్వయం ఉపాధికి బాటలు వేయాలన్న సంకల్పంతో వృత్తి విద్యా శిక్షణలో భాగంగా 261 మందికి ఉచితంగా మోటార్‌తో కూడిన కుట్టుమిషన్లను మంగళవారం జనశిక్షణా సంస్థాన్‌లో అందజేశామని డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.భాస్కరరామ్, రోటరీ పూర్వ గవర్నర్ ఎం.జగదీశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనశిక్షణా సంస్థాన్‌లో రెండు బ్యాచ్‌లు, ఎండాడ, మధురవాడ సెంటర్లలో ఒక్కో బ్యాచ్‌కు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పొందిన వారికి మంగళవారం సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేపట్టామన్నారు. స్వయం ఉపాధికి అవసరమైన స్వల్ప రుణాలు మంజూరు కోసం బ్యాంకులతో సంప్రదిస్తున్నామన్నారు. నెలకు రూ.10వేలు వరకూ ఆదాయం పొందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనశిక్షణా సంస్థాన్ చైర్మన్ రామరాజు, డైరెక్టర్ సిహెచ్.అప్పలనాయుడు, ఎల్.మనోహర్, చంద్రశేఖర్, శాంతాన్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు



ఎల్లమ్మ దేవాలయం

దాబాగార్డెన్స్: భక్తులకు కొంగుబంగారంగా పూజలందుకుంటున్న ఎల్లమ్మ జాతర వార్షిక ఉత్సవాలు ఈ నెల 28, మార్చి ఒకటి తేదీన పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. 28న తొలేళ్ల ఉత్సవం, మార్చి ఒకటిన జాతర జరపనున్నారు. మహాశివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ పప్పులవీధి జిల్లేడుమూడి వారి వీధిలో జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదునుపట్టు వద్ద ఎల్లమ్మకు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెడతారు. అక్కడి నుంచి బాణసంచా, మేళతాళాల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతరం ఎల్లమ్మతోటలోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, దర్శనాలు, ఉదయం నుంచి మాలధారణ భక్తులు శూలాల ప్రదర్శన నిర్వహిస్తారు. సాయంత్రం అగ్నిగుండం తొక్కుతారు.

'సరస్వతిదేవి సేవలు చిరస్మరణీయం'

ఎంవీపీ కాలనీ: లేబన్స్ హిల్పే మానసిక వికలాంగుల పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ టి.సరస్వతిదేవి సేవలు చిరస్మరణీయమని గీతం అధ్యక్షుడు శ్రీభరత్ అన్నారు. సరస్వతి దేవి 80వ జయంతి వేడుకలను మంగళవారం ఎంవీపీ కాలనీలోని లేబన్స్ హిల్పే మానసిక వికలాంగుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని సరస్వతిదేవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీభరత్ మాట్లాడుతూ సరస్వతి దేవి వికలాంగ విద్యార్థుల్లో ఆనందం కోసం నిత్యం పరితపించారన్నారు. హనీ గ్రూప్ అధినేత ఓబుల్ రెడ్డి విద్యార్థుల క్రీడా పోటీల కోసం రూ.25 వేలు సాయం అందజేశారు. క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, బ్రహ్మకుమారీస్ విశాఖ ప్రతినిధి రమక్క, పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం



ఆచార్య టి.షారోన్‌రాజు

ఏయూ క్యాంపస్: రాష్ట్రంలో సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాకారం అవుతోందని ఏయూ విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. తాజాగా ప్రకటించిన ఎమ్మెల్సీ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన ప్రాతినిధ్యం, ప్రాధాన్యతలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాజకీయాలలో గొప్ప మార్పుగా దీనిని చెప్పుకోవచ్చునన్నారు. అన్నివర్గాలకు న్యాయం చేస్తూ, అట్టడుగు వర్గాలను అక్కున చేర్చుకున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనంగా ముఖ్యమంత్రి నిలుస్తున్నారని చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థి నాయకుడు, ఏయూ పూర్వ ఆచార్యుడు కుంభా రవిబాబుకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంపై షారోన్‌రాజు హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు



విజయదుర్గాదేవికి సామూహిక లక్ష కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ఆరిలోవ: హనుమంతవాక దరి విజయదుర్గాకాలనీలో విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయ ప్రధానార్చకుడు మావుడూరు సంపత్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో మంగళవారం అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమంతవాక, విజయదుర్గా కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ, పెదగదిలి ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, స్థానిక నాయకులు.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

విద్యా సమాచారమ్

అనిశ్చిత పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించాలి



శ్రీనివాస ఠాగూర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: అనిశ్చిత పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించి రాణించే నైపుణ్యాలను యువతరం పెంపొందించుకోవాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. మంగళవారం ఏయూ డీసీఎంఎస్ విభాగంలో నిర్వహించిన ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం, జాతీయ మేనేజ్‌మెంట్ డే వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నిత్యం సమాజం మారుతుంటుందని, దీనిని తెలుసుకుని తదనుగుణంగా నైపుణ్యాలతో సుసంపన్నం కావాలన్నారు. అజినోమోటో బయో ఫార్మా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్-హెచ్‌ఆర్ డాక్టర్ పి.శ్రీనివాస్ ఠాగూర్ మాట్లాడుతూ సంక్లిష్ట సమయాలలో అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేశారు. మార్పును స్వాగతిస్తూ ముందుకు సాగే వారు నాయకులుగా ఎదుగుతారని చెప్పారు. నిరంతరం అభ్యసనం దీనికి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. మైలాన్ లేబొరేటరీస్ హెచ్‌ఆర్ విభాగాధిపతి జి.సరస్వతీరావు, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, విశాఖపట్నం మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య ఎస్.సాంబశివరావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వీఎంఏ సభ్యులు, డీసీఎంఎస్ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వీఎంఏ కార్యదర్శి టి.పి.ఎస్.ప్రసాద్ వందన సమర్పణ చేశారు.

18న కంప్యూటర్ సైన్స్ ఫ్రెషర్స్‌డే



ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, ఐటీ విభాగాల ఫ్రెషర్స్‌డే వేడుకలను వచ్చే నెల 18న నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, విభాగాధిపతులు ఆచార్య కె.వెంకటరావు, ఆచార్య కుంజం నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు



తెలుగు తల్లి విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, తదితరులు

మద్దిలపాలెం: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం తెలుగుదండు ఆధ్వర్యంలో మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. తెలుగుదండు వ్యవస్థాపక కార్యదర్శి పరవస్తు సూరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అతిథులుగా డాక్టర్ సూరపనేని విజయకుమార్, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, పైడా కృష్ణాప్రసాద్, వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు పాల్గొన్ని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలే వేసి నీరాజనాలు అర్పించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రాథమిక విద్య నుంచే మాతృభాషను కొనసాగించాలన్నారు. తెలుగు దండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ తెలుగు భాషను ప్రభుత్వ వ్యవహారిక భాషగా పాటించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృభాష ఆవశ్యకతను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు విద్యార్థులకు వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, తెలుగు విభాగాధిపతి కుసుమకుమారి, సంస్కృతం విభాగాధిపతి పోలా ఉమామహేశ్వరరావు, హిందీ విభాగాధిపతి ఎస్.సూర్యవతి మాట్లాడుతూ మాతృభాష గొప్పతనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, సిహెచ్.లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న కోలగట్ల వీరభద్రస్వామి



శ్రీవారి సన్నిధిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా అంతరాలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ అర్చకులు వేదాశీర్వాదం, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో రమేష్, సిబ్బంది ఆయనకు సాదర స్వాగతం పలికారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి

విద్యార్థులతో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కమిషనర్

మురళీనగర్: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంతోపాటు పూర్తిగా నిషేధించేందుకు విద్యార్థులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు కోరారు. ప్లాస్టిక్ నిషేధం, తడి-పొడి చెత్త నిర్వహణ అంశాలపై కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్లు భూమిలో కలవడానికి వెయ్యేళ్లు పడుతుందన్నారు. ప్లాస్టిక్ వల్ల జీవజాతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని వివరించారు. ప్లాస్టిక్ స్థానంలో గోనె, కాటన్‌తో తయారు చేసిన సంచులు వినియోగించాలని సూచించారు. ఈ మార్పు విద్యార్థులతోనే ప్రారంభం కావాలన్నారు. ఇంట్లోని తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి ఇచ్చేలా చూడాలన్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర వహించాలని కమిషనర్ సూచించారు. ముందుగా కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. జోన్-5 కమిషనర్ కృష్ణ, కాలేజీ ప్రిన్సిపాల్ జి.వి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వరుసగా ద్విచక్ర వాహనాల చోరీ

మత్రిపాలెం: మత్రిపాలెం శ్యామ్‌నగర్ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఓ వ్యక్తి ఇంటి ముందు పార్క్‌చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాడు. శ్యామ్‌నగర్ కాలనీకి చెందిన బీలా రవికుమార్ పనులు ముగించుకుని ఎప్పటిలాగే సోమవారం రాత్రి ఇంటి ముందు తన టూవీలర్‌ను పార్కింగ్ చేశాడు. సోమవారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి నడుచుకుంటూ వచ్చి వాహనంతో పరారయ్యాడు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్టు క్రైం పోలీసులను వివరణ అడగ్గా.. బాధిత వ్యక్తి ఫిర్యాదు ఇవ్వడానికి ఇష్టపడలేదని, ఒకసారి వెరిఫై చేసుకున్నాక ఇస్తారని చెప్పినట్టు తెలిపారు.

నెల రోజుల వ్యవధిలో 3..

గత నెలలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు వచ్చిందని క్రైం పోలీసులు తెలిపారు. మొత్తంగా నెల రోజుల వ్యవధిలో 3 ద్విచక్ర వాహనాలు మాయమయ్యాయి. గత నెల 19న వరప్రసాద్, నాగసతీష్ అనే ఇద్దరు యువకుల ద్విచక్ర వాహనాలు దొంగతనానికి గురికాగా, మంగళవారం తెల్లవారుజామున మరో వాహనం చోరీ జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి పూట ఈ ప్రాంతంలో కనీస గస్తీ లేదని, అర్ధరాత్రి గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.